
క్లుప్తంగా

కాంగ్రెస్ సోషల్ మీడియా అధ్యక్షుడిగా నరేష్



చిలుకూరు : కాంగ్రెస్ పార్టీ చిలుకూరు మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన ఎలుగూరి నరేష్‌గౌడ్ నియామితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు తనను నియమించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు.

కొనసాగుతున్న బాలకోటేశ్వరస్వామి జాతర


బాలకోటేశ్వరస్వామి

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురం రెవెన్యూ పరిధిలో గల గట్టుపై శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద జాతర కొనసాగుతోంది. సోమవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అలాగే భక్తులు వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. పరిసర ప్రాంత గ్రామాలతో పాటు, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

కోదాడరూరల్ : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రెడ్లకుంట సర్పంచ్ సాధినేని లీలాఅప్పారావు అన్నారు. సోమవారం గ్రామంలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనారోగ్యం దరిచేరకుండా ఉండాలంటే ఆహార నియమాలు పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం


డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన

హుజూర్‌నగర్ : పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన తెలిపారు. మున్సిపాలిటీలోని 14 వార్డులో రూ.4.30 లక్షలతో నూతనంగా చేపట్టిన డ్రెయినేజీ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వి.త్రివేణి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువుల వాడకంపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న లయోలా కళాశాల విద్యార్థులు

గరిడేపల్లి : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతులకు లయోలా కళాశాలకు చెందిన వ్యవసాయ డిగ్రీ విద్యార్థినులు సోమవారం నానో ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. నానో ఎరువులను మొక్కలు తొందరగా గ్రహించగల్గుతాయని తెలిపారు. నానో ఎరువుల వాడకంతో మొక్కల పెరుగుదల, దిగుబడి మెరుగుపడుతుందని అనేక పరిశోధన అధ్యాయనాలు వెల్లడించాయని విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు అల్లాడ మానస, కొప్పుల జ్ఞానసిరి, శ్రీనిధి, పాల్వాయి ఆకర్షరెడ్డి, హారిక, అఖిల, సింధుప్రియ, రైతులు పోరెడ్డి వెంకట్‌రెడ్డి, రావుల ముత్యాలు, సాలికంటి వెంకటేశ్వర్లు, చింతలపాటి ఆంజనేయులు, బండ వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

దాతల సహకారం అభినందనీయం

నడిగూడెం : ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని శ్రీ షిర్డీ సాయి సేవా సమితి ట్రస్టు అధ్యక్షుడు మండవ వెంకటేశ్వర రావు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరం ఆవరణలో భోజనశాల ఏర్పాటుకు నడిగూడెంకు చెందిన పప్పుల వెంకటమ్మ తన భర్త రామయ్య జ్ఞాపకార్థంగా రూ.25 వేలను సోమవారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, గౌరవ సలహాదారుడు పసుపులేటి భిక్షం, కొరట్ల తిరపయ్య పాల్గొన్నారు.

ఇళ్లు ఇచ్చారు.. వసతులు మరిచారు

- డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కరువు
- గృహ ప్రవేశాలు చేయించి చేతులు దులుపుకున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు


పోలేనిగూడెంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మట్టి పోసుకున్న లబ్ధిదారులు

చిలుకూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని ఆర్లెగూడెంలో 20, పోలేనిగూడెం 40, నారాయణపురంలో 40 ఇళ్లకు సంబంధించి అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసి గృహ ప్రవేశాలు కూడా చేయించారు. ఇక లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసి నేలలు గడుస్తున్నా నేటికీ అక్కడ వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు అక్కడ నివాసం ఉండడం లేదు. డబుల్ బెడ్ ఇళ్లలో కనీస వసతులైన కరెంట్, తాగునీటి సౌకర్యం లేదు. డ్రెయినేజీ ఏర్పాటు చేయలేదు. మొక్కుబడిగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి గృహ ప్రవేశం చేయించి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ గ్రామాలు ఇలా ఉండగా బేతవోలు గ్రామంలో నిర్మించిన 60 డబుల్ బెడ్ ఇళ్లకు సంబంధించి గ్రామ సభలు పూర్తయ్యాయి. కానీ నేటి వరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తికాలేదు.

నిధులొచ్చాయి కానీ..

కాగా, ఆయా గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీ రాజ్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఆర్లెగూడెంలోని 20 డబుల్ బెడ్ రూం ఇళ్లకు రూ.25 లక్షలు, నారాయణపురం, పోలేనిగూడెం గ్రామాల్లోని 40 డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి ఒక్కో గ్రామానికి రూ.50 లక్షల చొప్పున కోటి రూపాయలు, అలాగే బేతవోలు గ్రామంలో నిర్మించిన 60 ఇళ్లకు రూ.75 లక్షలకు ప్రతిపాదనలు పంపించారు. ఆ నిధులు కూడా ప్రభుత్వం నుంచి మంజురయ్యాయి. కావున తక్షణమే ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయా గ్రామాల లబ్ధిదారులు కోరుతున్నారు.

సదుపాయాలు కల్పించాలి



నాకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చారు. గృహ ప్రవేశం కూడా చేయించారు. కానీ ఆ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేదు. కనీసం కరెంట్ లేదు, నీళ్లు లేవు, డ్రెయినేజీ లేదు. అక్కడ ఎలా జీవించాలి. కూలీ పనులకు వెళ్లగా వచ్చిన డబ్బులతో మేమే అక్కడ మట్టి పోయించుకున్నాం. అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– దివ్య, డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారురాలు, పోలేనిగూడెం

మార్చికల్లా పనులు పూర్తిచేస్తాం



ఆర్లెగూడెం, నారాయణపురం, పోలేనిగూడెం, బేతవోలు గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు సుమారుగా రూ.2 కోట్ల ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు కూడా వచ్చాయి. ఇప్పటికే కరెంట్ సౌకర్యం ఏర్పాటుకు సంబంధిత ఏఈతో ప్రతిప్రాదనలు వేయించాం. వెంటనే పనులు ప్రారంభిస్తాం. మార్చి నెలాఖరికల్లా పనులు పూర్తి చేస్తాము.

– లక్ష్మారెడ్డి, పీఆర్ ఏఈ, చిలుకూరు

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

- ఎమ్మెల్యే సైదిరెడ్డి


హుజూర్‌నగర్‌లో మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : మైనార్టీ స్కూల్‌లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని బోరు మూడు రోజులుగా పని చేయడం లేదనే విషయం తెలుసుకుని భవన యజమానిని పిలిపించి మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని చెప్పారు. అనంతరం తరగతి గదులను, హాస్టల్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఏ చిన్న సమస్య, అసౌకర్యం ఉన్నా వెంటానే ఫోన్ ద్వారా తనకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో చదువుకుని ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. బోరు, మోటార్ సిద్ధం అయ్యేవరకు మున్సిపాలిటీ నుంచి నీటిని పంపిస్తామని ప్రిన్సిపాల్ రెహానా బేగంకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ భారత్ మిషన్'పై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : స్వచ్ఛ భారత్ మిషన్‌పై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ×స్వచ్ఛ భారత్ మిషన్×పై సర్పంచ్‌లు, కార్యదర్శులు, వీఓఏలకు మూడు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీఓ శాంతకుమారితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓడీఎస్ ప్లస్, సస్టైనబులిటీ, బయో డిగ్రేబుల్ వేస్ట్ మెనేజ్మెంట్, ప్లాస్టిక్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్, ఫీకల్ స్లడ్జ్ మేనేజ్‌మెంట్, గ్రేట్ వాటర్ మేనేజ్‌మెంట్, విలేజ్ శానిటేషన్ ప్లాన్ తదితర అంశాలపై శిక్షణ, అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలాన, సర్పంచ్‌లు అన్నెం శిరీషాకొండారెడ్డి, షేక్ సలీమారంజాన్, సౌజన్యనరేష్, నాగసైదయ్య, జయమ్మధనమూర్తి, అంజిరెడ్డి, రమ్యానాగరాజు, సైదేశ్వరావు, సైదులు, ఎంటటీ ట్రైనర్లు, నరేందర్‌రెడ్డి, సందీప్, హరి, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రత్యేకార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్త నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము, రక్షాబంధనం, రుత్విగ్వరనం మాంగల్యధారణ చేశారు. అదేవిదంగా స్థానిక శివాలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్ ,ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాబాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి ,ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైస్ ఎంపీపీ లక్ష్మీనారాయణ

నేరేడుచర్ల : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని దిర్శించర్ల గ్రామంలో దిర్శించర్ల వాలీబాల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి వరంగల్ జట్టు రూ.25 వేలు, ద్వితీయ బహుమతి వెంకటేష్ టీం రూ.20 వేలు, తృతీయ బహుమతి నందిపాటి కిరణ్ టీం రూ.15, 116 వేలు, చతుర్థ బహుమతి త్రిపురారం టీం రూ.10 వేలతో పాటు షీల్డులను గెలుపొందారు. వీరికి వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కర్నె నాగిరెడ్డి, ఏలిషా, పాండ య్య, జగతయ్య, శ్రీనివాస్, లింగయ్య, సీతారాంరెడ్డి, యాదగిరి, విజయరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

మెగా జాబ్‌మేళా వాల్ పోస్టర్ ఆవిష్కరణ


చిలుకూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిలుకూరు : కోదాడలో ఈ నెల 25వ తేదీన బీఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కె.శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబోయే మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని శశిధర్‌రెడ్డి యువసేన నాయకులు కోరారు. సోమవారం చిలుకూరులో మెగా జాబ్‌మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువసేన నాయకులు మేకపోతుల శ్రీను, కొడారు వెంకటేశ్వర్లు, బెల్లంకొండ సూర్యప్రకాశ్, నాశబోయిన సందీప్, బండ్ల అనిల్, మండవ అఖిల్, ఎం.ఉపేందర్, బాదె మధు, వరుణ్, మణి, అభిలాష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


కోదాడరూరల్ : గుడిబండలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కవిత


పాలకవీడు : బెట్టతండాలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ మోతీలాల్‌నాయక్

కోదాడరూరల్ : మండలంలోని గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుడిబండలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆమె ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలన్నారు. కార్యక్రమంలో ఎండీ.సలీం, ఆత్కూరి శేషు, రఫీ, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు ఉన్నారు.

బెట్టతండాలో..

పాలకవీడు : మండలంలోని బెట్టతండాలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ మాలోత్ మోతీలాల్ నాయక్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో శివాజీ, కిషన్, శ్రీను, నాగేందర్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి మృతికి సంతాపం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన వ్యాపారి ఉప్పల శ్రీహరి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన మృతికి మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం, వర్తక సంఘం, ఆవోపా, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, టీఎస్‌టీయూసీ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీహరి మృతి బాధాకరమని అన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం

నడిగూడెం : మండల కేంద్రంలోని రాజావారికోట వెనుక ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వీరాచారి, రవి, రాజాచారి, నాగబ్రహ్మాచారి, ఉపేంద్రచారి, ధనాచారి, సతీష్, గంగాచారి, భక్తులు పాల్గొన్నారు.

మేళ్లచెరువులో రసవత్తరంగా ఎడ్ల పందేలు

- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, మల్లయ్యయాదవ్


ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, శానంపూడి సైదిరెడ్డి

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఎడ్ల పందేలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఎడ్ల పందేలను ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్‌లు ప్రారంభించి మాట్లాడారు. ఎడ్ల పందేలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని అన్నారు. మన జాతరలు, పండుగలను మరువకుండా జరుపుకుంటూ సంస్కృతి, సంప్రదాయాలకు భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. కాగా పోటీల్లో నాలుగు పళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా ముప్పాళ్ల మండలం మద్దిరాల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి జత 10 టన్నుల 60 కేజీల బరువును 10 నిమిషాల వ్యవధిలో 4750 అడుగుల దూరాన్ని లాగి మొదటి బహుమతి సాధించాయి. అదేవిధంగా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన జక్కుల వెంకటేశ్వర్లు యాదవ్‌కు చెందిన జత 10 నిమిషాల వ్యవధిలో 10 టన్నుల 60 కేజీల బరువును 4250 అడుగుల దూరం లాగి రెండవ బహుమతి సాధించాయి. అలాగే గుంటూరు జిల్లా తోటపాలెం గ్రామానికి చెందిన రామినేని రత్తయ్య చౌదరి జత 10 టన్నుల 60 కేజీల దూరాన్ని 10 నిమిషాల వ్యవధిలో 4209.5 అడుగుల దూరాన్ని లాగి మూడవ బహుమతి సాధించాయి. దీంతో మొదటి బహుమతి హీరో హోండా స్పెండర్ బైక్, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలను ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఎద్దుల యాజమానులకు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలనాగమ్మ నాటకం

మేళ్లచెరువు శ్రీ శంభులింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో స్థానిక శంభులింగేశ్వర నాట్య కళామండలి అధ్యక్షుడు పోశం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేట సినీ సెట్టింగ్‌లతో ప్రదర్శించిన బాలనాగమ్మ నాటకం ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు విశేషంగా అలరించింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు మాయల పకీరు మంత్రజాలం, పద్యాలు, పాటలు, హాస్యపు చతురోక్తులతో ఆద్యంతం అలరింపజేశారు. కళాకారుల సంఘం రాష్ట్ర, జిల్లా బాధ్యులు ధర్మూరి, కంబాల వాఖ్యానంతో రంజింపజేశారు. అనంతరం పోశం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది కళాకారులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ప్రముఖ హార్మోనిస్టు వినాయకరాజుతో పాటు పోశం వీరారెడ్డి, ఏసీరెడ్డి వీరారెడ్డి, కళాకారులు జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ సతీష్‌పాల్, ఎస్కే సైదులు, రాంబాబు, సైదులు, రామారావు, ధర్మయ్యగౌడ్, ఉప్పు కృష్ణ, శివశంకరాచారి, హనిమిరెడ్డి, వీరమణి, అశ్విని, శైలజ, శాంతి, జయశంకర్, గురుబ్రహ్మాచారి, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.


బాలనాగమ్మ నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదానం

మేళ్లచెరువు జాతరకు వచ్చే భక్తులకు ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని మూడవ రోజు ఆ ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు అన్నదానం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా సోమవారం సుమారు 5 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శివారెడ్డి, యాకూబ్ బాబా, వెంకన్న తదితరులున్నారు.


మేళ్లచెరువులో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఓజో చైర్మన్ పిల్లుట్ల రఘు

సాముల ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

జాతరకు వచ్చే భక్తులకు సాముల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

మునగాల : కాషాయం జెండా పట్టిన వారే నిజమైన హిందువులని, ఇతర పార్టీల జెండాలు పట్టుకున్న వారు హిందువులు కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇటీవల సిరిసిల్లలో జరిగిన సభలో అభ్యంతరకర వాఖ్యలు చేయడాన్ని సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఓ జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా, గౌరవప్రదమైన ఎంపీ పదవిలో ఉండి ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లాడడం దురదృష్టకరమన్నారు. రాజకీయాల్లో తన స్వలాభం, స్వార్థం కోసం వివిధ పార్టీలో ఉన్న వారిని అవమానించేలా మాట్లాడడం సబబు కాదని హితవు పలికారు. వివిధ పార్టీలలో ఉన్న వేర్వేరు మతాల వారు కూడా హిందూ ధర్మాన్ని గౌరవిస్తున్నారని, సనాతన ధర్మం కోసం, సమాజహితం కోసం పోరాడేవారు అన్ని పార్టీలలోనూ, మతాలలోనూ ఉన్నారని బండి సంజయ్ గుర్తించకపోవడం విచారకరమన్నారు. ఇలాంటి అభ్యంతరకర వాఖ్యలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతియ్యడం దురదృష్టకరమని, బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకొని బేషరతుగా క్షమాపణ చెప్పాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు.

మహాప్రస్థానం పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని మహాప్రస్థానంలో జరుగుతున్న తుదిదశ పనులను సోమవారం సాయంత్రం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాప్రస్థానం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్‌రావు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోమెటిక్ స్టార్టర్ల తొలగింపు సరికాదు



మాట్లాడుతున్న పోకల వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రైతులు మోటార్లకు ఆటోమెటిక్ స్టార్టర్లు ఏర్పాటు చేసుకున్నారని, వాటిని తొలగించడం సరికాదని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటలు విద్యుత్ ఇస్తామని చెప్పి నేడు కనీసం 9 గంటలు కూడా ఇవ్వడం లేదని అన్నారు. మోటార్లకు ఆటోమెటిక్ స్టార్టర్లు లేకుంటే రైతులు రాత్రి, పగలు పొలాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడితే సీపీఐ వారి తరపున రాజీలేని పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యుడు కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, వెంకన్న, వెంకట్‌రెడ్డి, సైదులు, లింగరాజు, కోటయ్య తదితరులున్నారు.

'ప్రజావాణి'కి మూడు దరఖాస్తులు


ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సరిత తెలిపారు. భూ సమస్యలపై రెండు దరఖాస్తులు, ఆర్ అండ్‌బీ రోడ్డు సమస్యపై ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. ప్రజావాణికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరయ్య, ఎస్ఐ నవీన్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఏఈ శివకుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రవంతి, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారిని నాగిని, ఎంఈఓ చత్రునాయక్, ఎంపీఓ విజయకుమారి, పీఆర్ ఏఈ మధు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

విద్యార్థులను పట్టించుకోని భవిత కాలేజీ యాజమాన్యం


ఇంటర్ బోర్డు అధికారి కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలో 60 ఫీట్ల రోడ్డులో ఉన్న భవిత ఇంటర్మీడియట్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను పట్టించుకోవడంలేదని, గోడ కూలి 13 మంది విద్యార్థులకు గాయాలైన కనీసం వారిని పరామర్శించడానికి కూడా రాలేదని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. సోమవారం భవిత కళాశాల ఎదుట నిరసన తెలిపి, అనంతరం జిల్లా ఇంటర్ బోర్డు అధికారి జానపాటి కృష్ణకి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ఈ కాలేజీ సభ్యత్వాన్ని రద్దుచేసి సీజ్ చేయాలని, యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు భారి అశోక్ కుమార్, తగుళ్ల జనార్దన్‌యాదవ్, నాయిని రాంమూర్తి, వికాస్‌రాజ్ పాల్గొన్నారు.